క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చంద్రగిరి: అగరాల పంచాయతీలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి సీసీ రోడ్డు పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో సుమారు రూ.30 లక్షల తుడా నిధులతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సచివాలయం నుంచి 300 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ సుశీల, వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు చిరంజీవి రెడ్డి, నందిపుట్టి బాలకృష్ణ, మహ్మద్ సాహిర్, పురుషోత్తం రెడ్డి, ఉస్మాన్, నాగేశ్వరావు రెడ్డి, సునీల్, రహీం, బాషా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి సత్రాల్లో పని చేస్తున్న 54 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ, సీపీఐ నేత విశ్వనాథ్, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ద్రాక్షాయని, అరుణ, అనుబంధ సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. ఏఐటీయూసీ నేలు ఎన్‌డీ.రవి, చంద్రశేఖర్‌రెడ్డి, కేవై.రాజా, శివ, ప్రజాసంఘాల నేతలు మహేంద్ర, బాబు, అల్లాబక్ష్, శ్రీనివాసులు, ఏపీ బాల, గీత, గంగులమ్మ, జ్యోతి, లక్ష్మమ్మ, కాంటాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రాజు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

ప్రతిభకు అవార్డు



అవార్డు అందుకున్న ఆరోగ్య మిత్ర మహేష్

తిరుపతి అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరోగ్యమిత్ర జే.మహేష్‌కు అవార్డు వరించింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా ఆరోగ్య మిత్ర పురస్కారంతోపాటు రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

పలిమారు మఠం పీఠాధిపతికి చిన్న మర్యాద

తిరుమల: ఉడిపిలోని పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ స్వామీజీకి సోమవారం టీటీడీ తరపున చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. పీఠాధిపతితోపాటు ఈఓ ధర్మారెడ్డి ఉన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పశు వ్యాధి నిర్ధారణ, నివారణ అనే అంశంపై మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల విభాగాధిపతి డాక్టర్ రాణిప్రమీల తెలిపారు. సోమవారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా వర్సిటీ వీసీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలక్రిష్ణ ద్వివేది, మహిళావర్సిటీ వీసీ భారతి, సంస్కృత వర్సిటీ వీసీ క్రిష్ణమూర్తి పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఉడిపి స్వామి ఆశీర్వాదం



టీటీడీ చైర్మన్ భూమన చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రాధాకృష్ణ





ఉడిపి శ్రీపలిమారు పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ ఆశీర్వచనాలు అందుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేని అభినందిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి ఉడిపి శ్రీపలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ ఆశీర్వచనాలు అందించారు. సోమవారం రాత్రి పద్మావతిపురంలోని తన నివాసానికి విచ్చేసిన స్వామీజీకి భూమన కరుణాకరరెడ్డి పాదాభివందనం చేశారు.

సత్కారం

తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్ సోమవారం రాత్రి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పద్మావతి పురంలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను భూమన శాలువాతో సత్కరించి అభినందించారు.

నియామక పత్రం అందజేత

చెన్నై ఎల్ఏసీ సభ్యుడుగా నియమితులైన రాధాకృష్ణకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. సోమవారం సాయంత్రం పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.

గడపగడపలో చెవిరెడ్డి లక్ష్మీ ఆత్మీయ పలకరింపు

– వెంకటపతినగర్‌లో ఘన స్వాగతం



మహిళలతో ముచ్చటిస్తున్న చెవిరెడ్డి లక్ష్మీ

తిరుపతి రూరల్: మండలంలోని వెంకటపతి నగర్ పంచాయతీ పరిధిలో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ నిర్వహించారు. సోమవారం వెంకటపతినగర్ పంచాయతీ పరిధిలో ప్రతి గడపకు వెళ్లిన ఆమె జగనన్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా గ్రామ దేవతలకు పూజలు చేసిన ఆమె ఆ తర్వాత గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు పూల వర్షం కురిపించి, ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపలో ఆమెకు హారతి పట్టి సాదరంగా ఆహ్వానించారు. తమ ఇంటి స్థలాలకు శాశ్వత హక్కు కల్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబంపై సానుకూలత వ్యక్తం చేశారు. చెవిరెడ్డి మోహిత్రెడ్డిని తప్పకుండా ఎమ్మెల్యేగా ఆదరిస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, ఎంపీటీసీ నారాయణమ్మ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రష్‌లో మెడికల్ ఐసీయూ



మెడికల్ ఐసీయూను ప్రారంభిస్తున్న ఉడిపి పలిమారు పీఠాధిపతి విద్యాధీశ తీర్థస్వామీజీ

తిరుపతి కల్చరల్: రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని రష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ ఐసీయూను సోమవారం ఉడిపి శ్రీపలిమారు పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ పేదలకు ఉచితంగా లేదా కనీస రుసుముతో వైద్యం చేస్తే దాని ఫలితం పునర్జన్మలోనే కాకుండా ఈ జన్మలో కూడా కనబడుతుందని తెలిపారు. అనంతరం రష్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మెడికల్ ఐసీయూ, మెడికల్ స్పెషలిస్ట్, నెఫ్రాలజీ, న్యూరో ఫిజీషియన్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మత్తు పదార్థాలు, నిద్రమాత్రలు, పురుగుల మందు తాగిన వారు, పాటుకాటు, ప్రమాదాలకు గురైన వారు, పక్షవాతం, ఊపిరితిత్తుల నెమ్ము, ఆస్తమా, డయాలసిస్ అవసరమైన వారికి వెంటిలేటర్‌తో కూడిన అత్యవసర వైద్య సేవలు ఐసీయూలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్లు పవన్‌కుమార్, సాయితేజశ్రీ, శివకుమార్, డాక్టర్ కీర్తి సాగర్‌రెడ్డి, డాక్టర్ మౌనారెడ్డి, వీవీ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్ సి.సురేంద్ర

తిరుపతి కల్చరల్: ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉదయి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సి.సురేంద్ర తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దవటం యానాదయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్షులు, కన్వీనర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి టీఎస్ పరమశివం, డైరెక్టర్ నూకరాజు, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరయ్య, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

పద్మావతిలో రిటైర్డ్ అధ్యాపకురాలి జయంతి



విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న టీటీడీ డీఈఓ

తిరుపతి సిటీ: పద్మావతి డిగ్రీ కళాశాలను ఎంతో అభివృద్ధి పథంలో నడిపిన రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ రాజేశ్వరీమూర్తి కళాశాల శిల్పి అని టీటీడీ డీఈఓ డాక్టర్ ఎం.భాస్కరెడ్డి కొనియాడారు. సోమవారం కళాశాల ఆవరణలో రాజేశ్వరీమూర్తి 103వ జన్మదినం సందర్భంగా డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆమె సేవలు చిరస్మరణీయమన్నారు. విద్యార్థులు ఆమె అడుగుజాడలలో నడవాలని పిలుపునిచ్చారు. ఆమె శిష్యురాలైన రిటైర్డ్ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ప్రేమావతి విద్యార్థుల కోసం రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ప్రతి ఏడాది వచ్చే వడ్డీని కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అందజేయడం హర్షనీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ మహదేవమ్మ, అధ్యాపకులు శాంతి, భద్రమణి, ఉమా రాణి, విద్యుల్లత, జయశ్రీ పాల్గొన్నారు.

తిరుమలకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం తిరుమలకు చేరుకున్నారు. స్వామివారి దర్శనార్థం విచ్చేసిన ఆయనకు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి శ్రీరచన అతిథిగృహం వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రీవారిని దర్శించుకోనున్నారు. దీని కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలి



వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్పందన, డయల్ యువర్ కమిషనర్‌కు వచ్చే ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపాల్సిందేనని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత స్పష్టం చేశారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌కు– 17, స్పందనకి– 40 ఫిర్యాదులు అందాయి. వీటిపై సమీక్ష నిర్వహించిన కమిషనర్ ప్రతి సమస్యకు చక్కని పరిష్కార మార్గాన్ని చూపించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేస్తూ ఎస్‌టీవీ నగర్‌లో యూడీఎస్ బ్లాక్ అయ్యి ప్రజలకి ఇబ్బందిగా ఉందని, 14వ డివిజన్‌లో ఇప్పటికే ప్రతిపాదించిన పనులను చేపట్టాలని కోరారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి స్పందనలో వినతి పత్రం సమర్పిస్తూ గాంధీరోడ్డు, పూల అంగళ్లు వద్ద హథీరాంజీ మఠానికి సంబంధించిన చిన్న చిన్న అంగళ్లల్లో 50 సంవత్సరాల నుండి షాపులు నిర్వహించుకుంటున్నారని, శిథిలావస్థ పేరిట వారిని ఖాళీ చేయాలని మఠం అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ నిధులతో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పిస్తూ గాలివీధిలో పాడైపోయిన కాలువలను నిర్మించాలన్నారు. తిమ్మినాయుడు పాలెంలో తెలుగుగంగ నీరు కలుషితమైందని, ప్రకాశం పార్కులో పాడైపోయిన జిమ్ పరికరాలను మార్చాలని వినతి పత్రాన్ని అందించారు. శానిటేషన్, మురుగు, మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లో సమస్యలపై పలు ఫిర్యాదులు అందాయి. అర్జీలపై కమిషనర్ హరిత స్పందిస్తూ సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తిరుమల: దర్శనానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఈ నెల మూడో తేదీన చోటుచేసుకుంది. తిరుమల వన్ టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా వరంగల్ మండలానికి చెందిన తలారి మల్లేశం (55) తన కుమారుడు వెంకటేష్ కుటుంబీకులతో కలిసి ఈనెల మూడో తేదీన తిరుపతికి చేరుకున్నారు. అదేరోజు మధ్యాహ్నం తిరుమల శ్రీవారిని దర్శించుకుని బయటకు వచ్చే క్రమంలో మల్లేశం జనాల రద్దీలో కనిపించకుండా పోయాడు. అయితే ఎంత వెతికినా కనిపించకపోవడంతో తిరుమలలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సోమవారం తలారి వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ లభ్యమైతే 91541 41893 నెంబరులో సంప్రదించాలన్నారు.

గడపగడపలో అపూర్వ స్వాగతం

- సంక్షేమ పథకాల జాబితా చేతబట్టి.. ప్రతి ఇంటికీ
- శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు
- సమస్యలు తెలుసుకున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



సంక్షేమ పథకాల జాబితాను అందిస్తున్న యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: జగనన్న ప్రభుత్వం నిరుపేదలకు అందించిన సంక్షేమ పథకాల జాబితాను చేత బట్టి ప్రతి ఇంటికీ వెళ్లిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి గడప గడపలో అపూర్వ స్వాగతం లభించింది. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల నుంచి సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని పలువురు మహిళలు వినతులు సమర్పించారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల జాబితాను అందిస్తూ మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా అరిగిలవారిపల్లి గ్రామంలోని శ్రీ కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం సంక్షేమ జాబితాను చేతికి తీసుకుని మాకు మేలు చేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని మాట ఇచ్చారు.

అన్న దమ్ముల.. సందడే సందడి..

పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సందడి చేశారు. గ్రామ దేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ ఆప్యాయతను పంచారు. మొట్టమొదటి సారిగా రామలక్ష్మణుల్లాంటి ఇద్దరు అన్నదమ్ములు మా గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి, ఎమ్మెల్యే హోదాలో మా గ్రామానికి రావాలని, గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. ప్రతి ఒక్కరిని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పలకరిస్తూ, వారి బాగోగులకు తెలుసుకుంటూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఎంపీడీఓ బాలాజీ నాయక్, తహసీల్దార్ శిరీష, ఈఓపీఆర్డీ శశిరేఖ, పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగల్రాయులు, నాయకుడు మణియాదవ్, మాజీ సర్పంచ్ గోపాల్, నాగభూషణం, నాగేశ్వరరావు, హరికృష్ణ, దూర్వాసులు, చిట్టి, ఢిల్లీశ్వర్ యాదవ్ ఇతర వైఎస్ ఆర్ సీపీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితులు పరిహారం పొందాలి

చంద్రగిరి: కుక్కలపల్లి–మల్లవరం 6 లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ 3డి నోటిఫికేషన్ ద్వారా చంద్రగిరితో పాటు తొండవాడ గ్రామ పరిధిలో స్వాధీనం చేసుకున్న భూ యజమానులు, రైతులు వెంటనే నష్టపరిహారం తీసుకోవాలని తహసీల్దార్ శిరీష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం సుమారు 90శాతానికి పైగా తీసుకోవడం జరిగిందన్నారు. అయితే చంద్రగిరి మండలంతోపాటు, తొండవాడ గ్రామాలకు చెందిన రైతులు, భూ యజమానుల్లో కొంత మంది నష్టపరిహారం పొందలేదని తెలిపారు. సుమారు 57 మంది వరకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, పరిహారం పొందని వారు, వారు కోల్పోయిన భూమికి సంబంధించి హక్కు పత్రాలను సంబంధిత తహసీల్దార్‌కు అందజేసి నష్టపరిహారం పొందాలని ఆమె కోరారు. మంగళవారం నుంచి 15 రోజుల్లోపు పరిహారం పొందాలని, లేకుంటే 1957 చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



హాజరైన అతిథులతో కళాశాల అధికారులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ఎండ్‌పాయింట్ డిటెక్షన్ అండ్ రెస్పాన్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ ఐటీ అడ్వైజర్ శేషిరెడ్డి, కన్సోర్షియం ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అశగార్ స్వామీ, ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి, ఫ్రాన్స్ న్యూక్లియాన్ సెక్యూరిటీ కంపెనీ సీఈఓ ఆనస్‌చనా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం అతిథులను కళాశాల అధికారులు సన్మానించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ ఆర్ స్వాతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి ఆదాతో భవిష్యత్ తరాలకు మేలు

తిరుపతి ఎడ్యుకేషన్: శక్తిని పొదుపుగా వాడుకుంటూ ఆదా చేయడం ద్వారా భవిష్యత్తు తరానికి ఎంతో మేలు చేసిన వారమవుతామని శ్రీపద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరిదేవి తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం, టీసీడీఈ సంయుక్తంగా ఎనర్జీ కన్జర్వేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజన్ కుమార్ మాట్లాడుతూ ఎనర్జీ తయారీకి అవసరమైన మూలాలు, అతిగా వాడడం వలన జరిగే అనర్థాలను వివరించారు. ఎన్ఆర్ఈడీసీఏపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ సౌర శక్తి విధానం, సౌర శక్తి వినియోగంతో కలిగే ప్రయోజనాలు, సౌరశక్తి తయారీకి అవసరమైన పరికరాలపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ జగదీశ్వరి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్త్యేశ్వర స్వామి వార్షికోత్సవం



సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి దంపతులకు తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న అర్చకుడు

చంద్రగిరి: అగరాల గ్రామానికి చెందిన దివంగత వసంతమ్మ నిర్మించిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి 4వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేక సేవ చేపట్టారు. అనంతరం రుద్రాభిషేకం, పంచామృత అభిషేక సేవలను చేపట్టి, స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు నాగేశ్వర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ చంద్రబాబు, మహ్మద్ సాహిర్, ఉస్మాన్, అక్బర్, పఠాన్, రహీం, కేశవులు పాల్గొన్నారు.

జాతి హననం దిశగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం



సంకలన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తిరుపతి కల్చరల్: పాలస్తీనాలో జాతి హననం దిశగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ తెలిపారు. ఇజ్రాయిల్ చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక సదస్సులో పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం అనే అంశంపై సంకలన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా అమెరికా, బ్రిటన్ అండతో దేశ విస్తరణ లక్ష్యంగా అరబ్బులపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం పుస్తకంలోని వ్యాసాలను చదివితే ఇజ్రాయిల్ అకృత్యాలు తెలుస్తాయని వివరించారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ, జిల్లా అధ్యక్షుడు గురవయ్య, కార్యదిర్శ డాక్టర్ ప్రసాద్, కోశాధికారి రేణుకాదేవి, సీపీఐ నేతలు రామానాయుడు, మురళి, పెంచలయ్య, కుమార్‌రెడ్డి, విశ్వనాథ్, అరసం రాష్ట్ర కార్యదర్శి సాకం నాగరాజు, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

క్లాట్‌లో జాతీయ స్థాయి ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు కామన్ లా అడ్మిషన్ (క్లాట్) పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. ఆ విద్యాసంస్థలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ ఎస్ఎస్.రెడ్డి వివరాలను వెల్లడించారు. ఇంటర్ విద్యార్హతతో క్లాట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు దేశంలోని 23 ప్రముఖ కేంద్ర ప్రభుత్వ జాతీయ న్యాయవిద్య విశ్వవిద్యాలయాల్లో ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ న్యాయ విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. ఇంటర్ విద్యార్హతతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న క్లాట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థిని కదిరి రుషిత సంహిత జాతీయ స్థాయిలో 1,364వ ర్యాంకు, ఎస్.యశ్వంత్ 1,096కేటగిరి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను వారు అభినందించారు. క్లాట్ పరీక్షకు సంబంధించి ఉచిత గైడెన్స్‌కు తమను 9698123456లో సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా సమావేశం

తిరుపతి కల్చరల్: ఆమ్‌ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ ఆధ్వర్యంలో సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రమేష్ కుమార్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా జిల్లా నియోజకవర్గాలకు సంబంధించిన వలంటరీ మ్యాపింగ్ గురించి చర్చించారు.

ఘనంగా ముగిసిన శ్రీకపిలేశ్వర రుద్రయాగం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 1 నుంచి ఆరంభమై 11 రోజులపాటు జరిగిన రుద్రయాగం సోమవారంతో ఘనంగా ముగిసింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గత నెల రోజులపాటు ఆలయంలో విశేష పూజలు, హోమ మహోత్సవాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో చేపట్టిన రుద్రయాగం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. మంగళవారం శ్రీచండికేశ్వర స్వామివారి హోమం నిర్వహించనున్నారు.